క్లుప్తంగా

మాజీ ఎమ్మెల్యే యర్రంకు సత్కారం



సత్తెనపల్లి: పట్టణంలోని బాప్టిస్ట్ చర్చి మూడవ వార్షికోత్సవం సందర్భంగా మాజీ శాసనసభ్యుడు యర్రం వెంకటేశ్వర్‌రెడ్డి ని సంఘ బాధ్యులు ముఖ్యఅతిథిగా ఆహ్వానించి బుధవారం పూలమాలలు, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సంఘ కమిటీ సభ్యులు పెద్దింటి నాగేశ్వరరావు, గుజర్లపూడి సుందర్‌రావు, గుజ్జర్లపూడి మార్కురావు, సైకిలాబ్, ఇజ్రాయిల్, శరత్, తదితర పెద్దలు పాల్గొన్నారు.

ఈ కేవైసీ నమోదుకు నేటితో గడువు ముగింపు

నకరికల్లు: సాగులో ఉన్న పంటలకు ఈ-కేవైసీ నమోదు చేసుకునేందుకు గురువారంతో గడువు ముగుస్తుందని మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు బుధవారం తెలిపారు. రబీలో వరి, కంది, మినుము, జొన్న, శనగ, మొక్కజొన్న, కూరగాయలు సాగుచేస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 7,092 ఎకరాలకు ఈ-కేవైసీ ప్రక్రియ పూర్తయిందన్నారు. ఫార్మర్ ఈ-కేవైసీ 78 శాతం పూర్తయిందన్నారు. సంక్షేమ పథకాల లబ్ధి చేకూరాలంటే ఈ-కేవైసీ తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచించారు. 15వ తేదీ వరకు మాత్రమే గడువు ఉన్నందున రైతులు సద్వినియోదం చేసుకోవాలని సూచించారు.

సాందీపని ఆశ్రమంలో గాయత్రి మహాయజ్ఞం



కుందురువారిపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని కుందురువారిపాలెం గ్రామంలో సాందీపని ఆశ్రమం 8వ వార్షికోత్సవం సందర్భంగా పండిత శ్రీరామశర్మ ఆచార్య, జ్ఞానసరస్వతి మాత జయంతిని పురస్కరించుకొని బుధవారం గాయత్రి మహాయజ్ఞం నిర్వహించారు. వసంతపంచమి సందర్భంగా 24 కుండముల గాయత్రి మహాయజ్ఞంలో గాయత్రి పరివార్ సభ్యులు పాల్గొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా ఆశ్రమంలోని జ్ఞానసరస్వతి ఆలయంలో సరస్వతి పూజ, సామూహిక అక్షరాభాస్య కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

మిర్చి కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

దాచేపల్లి : రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మార్కెట్‌యార్డు చైర్మన్ కలకండ ఆంధ్రయ్య అన్నారు. నడికుడి వ్యవసాయ మార్కెట్‌యార్డు కార్యాలయంలో పాలకవర్గ సమావేశం బుధవారం జరిగింది. యార్డు అభివృద్ధితో పాటు మిర్చి కొనుగోలు కేంద్రం విస్తరణపై చర్చించారు. ఈ సమావేశంలో చైర్మన్ ఆంధ్రయ్య మాట్లాడుతూ మిర్చి కొనుగోలు కేంద్రాన్ని రైతులకు అందుబాటులో ఉంచామని, గుంటూరు యార్డుకి వెళ్లి మిర్చి అమ్ముకునే అవసరం లేకుండా ఇక్కడ ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలోనే రైతులు మిర్చిని అమ్ముకోవాలన్నారు. గుంటూరు యార్డుతో సమానంగా ఇక్కడ మిర్చికి గిట్టుబాటు ధర లభిస్తుందని, పల్నాడు ప్రాంతంలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. యార్డు అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఇటీవల జిల్లా కలెక్టర్ నుంచి అవార్డు తీసుకున్న యార్డు సూపర్‌వైజర్ సాంబశివరావుని సన్మానించారు. అనంతరం యార్డులో మిర్చి కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ సమావేశంలో నగర పంచాయతీ చైర్మన్ కొప్పుల సాంబయ్య, వైస్ చైర్మన్ తగుళ్ల పిచ్చయ్య, యార్డు కార్యదర్శి సూరె శ్రీనివాసరావు, సూపర్‌వైజర్ వెంగయ్య, యార్డు డైరెక్టర్లు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్‌లో ఉత్తీర్ణత



దాచేపల్లి : స్థానిక ఆదర్శ పాఠశాల విద్యార్థి మందా ఆకాష్ జేఈఈ మెయిన్‌లో ఉత్తీర్ణత సాధించారు. ఇటీవల జేఈఈ మెయిన్‌కు హాజరైన ఆకాష్ 75 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ రవికుమార్ బుధవారం తెలిపారు. ఆకాష్‌ని పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ నాళం శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా ఆలయ ప్రతిష్ట

మాచర్ల రూరల్: గ్రామ ప్రజలంతా ఐక్యంగా మణిదీప బుగ్గమల్లేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ట మహోత్సవ వేడుకలు వైభవంగా నిర్వహించుకోవటం ఆనందకరమని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని ముత్యాలంపాడు గ్రామంలో ప్రతిష్ట మహోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్వామి వారి ఆశీస్సులతో సుఖసంతోషాలతో, పాడి పంటలతో ఆనందంగా ఉండాలని ఆకాంక్షించారు. ఇదే ఐక్యతతో పేదల సంక్షేమం కోసం, రైతన్నలకు అండగా ఉంటున్న, అన్ని వర్గాల ప్రజలను ఆర్థికంగా అభివృద్ధి చేస్తున్న సీఎం జగన్‌కు అండగా నిలవాలన్నారు.

ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యం

- పదవ తరగతి విద్యార్థులపై ఉపాధ్యాయుల ఫోకస్
- ఉత్తమ ఫలితాల కోసం అదనపు తరగతుల నిర్వహణ
- మార్చి 18 నుంచి 30 వరకు పదవ తరగతి పరీక్షలు
- నియోజకవర్గంలో 3,538 మంది టెన్త్ విద్యార్థులు



పట్టణంలోని సుగాలీకాలనీ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక తరగతుల్లో విద్యార్థులు

సత్తెనపల్లి: విద్యార్థుల భవిష్యత్తును కీలక మలుపు తిప్పేది 10వ తరగతి. పబ్లిక్ పరీక్షలు మార్చి 18 నుంచి 30 వరకు జరగనున్నాయి. విద్యా శాఖ ముందుగానే పరీక్ష తేదీలు ప్రకటించింది. ఏడాది పొడవునా చదివినా చివరి రోజుల్లో విద్యార్థులను ప్రత్యేక శ్రద్ధతో ఉపాధ్యాయులు సంసిద్ధం చేస్తున్నారు. ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. డిసెంబర్ చివరికి అన్ని పాఠశాలల్లో పాఠ్యాంశాల బోధన పూర్తి చేశారు. ప్రస్తుతం విద్యార్థులకు పునశ్చరణ తరగతులు నిర్వహిస్తున్నారు. పదవ తరగతి పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలని ఉపాధ్యాయులు, ఉత్తమ గ్రేడ్ దక్కించుకోవాలని విద్యార్థులు అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంది.

పరీక్షలకు సన్నద్ధం..

డిసెంబర్ నుంచే పాఠశాలల్లో టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక పునశ్చరణ తరగతులు నిర్వహిస్తున్నారు. గత నెల 23 నుంచి ఫార్మేటివ్-3 పరీక్షలు నిర్వహించారు. ఈ నెల 23 నుంచి ప్రీ ఫైనల్ పరీక్షలు జరగనున్నాయి. సత్తెనపల్లి నియోజకవర్గంలోని సత్తెనపల్లి, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాల్లో 42 జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా గాంధీ విద్యాలయాలు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలబాలికల విద్యాలయాలు, మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల విద్యాలయం ఉన్నాయి. వీటిలో 10వ తరగతి చదువుతున్న 3,538 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు.

నియోజకవర్గంలో పాఠశాలలు విద్యార్థులు ఇలా ...

మండలం	ఉన్నత పాఠశాలలు	టెన్త్ విద్యార్థులు
సత్తెనపల్లి	18	2,073
ముప్పాళ్ళ	06	444
రాజుపాలెం	07	415
నకరికల్లు	11	606
మొత్తం	42	3,538

సందేహాలను నివృత్తి చేసుకుంటున్నాం..



పట్టణంలోని సుగాలి కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టెన్త్ చదువుతున్నాను. మార్చిలో పబ్లిక్ పరీక్షలు ఉండడంతో మాకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. మాకు ఎలాంటి సందేహాలు ఉన్నా నివృత్తి చేస్తున్నారు. మంచి మార్కులు సాధించేందుకు ప్రత్యేక తరగతులు మాకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయి.

– కర్రా మేఘన, టెన్త్ విద్యార్థిని, సత్తెనపల్లి

వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ..



ఫార్మేటివ్ పరీక్షల్లో వచ్చిన మార్కుల ఆధారంగా పాఠశాలల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నాం. సబ్జెక్టుల వారీగా విద్యార్థులతో పునశ్చరణ చేయించడం జరుగుతుంది. చదువులో వెనుకబడిన విద్యార్థులు పురోగతి సాధించేలా మరింత సమయాన్ని కేటాయించి వారి సందేహాలను నివృత్తి చేస్తున్నారు. ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేస్తున్నాం.

– అనంతవరం శ్రీనివాసరావు, ఎంఈఓ, సత్తెనపల్లి

ఒత్తిడి లేకుండా సన్నద్ధం..



టెన్త్ విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించడం వలన పరీక్షలపై ఒత్తిడి లేకుండా పాఠ్యాంశాలపై పట్టు సాధించేలా ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం. ఆయా సబ్జెక్టుల పాఠ్యాంశాలను పునశ్చరణ చేస్తున్నాం. పరీక్షల సమయంలో అవలంబించాల్సిన విధానంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం.

– పెద్దింటి వెంకట కోటేశ్వరరావు, గణిత ఉపాధ్యాయుడు, సత్తెనపల్లి

మంచి మార్కులు సాధిస్తాం..



పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతుల వల్ల పరీక్షల్లో మంచి మార్కులు సాధించగలమనే నమ్మకం ఉంది. ఈ ప్రత్యేక తరగతుల వల్ల ఎప్పటికప్పుడు తెలియని విషయాలు తెలుసుకుంటున్నాం. పబ్లిక్ పరీక్షలపై ఉండే భయం తగ్గిపోతుంది. పరీక్షల్లో ఎటువంటి ప్రశ్నలు ఇచ్చినా రాయడానికి సిద్ధంగా ఉన్నాం.

– కనగాల సాయికుమార్, టెన్త్ విద్యార్థి, సత్తెనపల్లి

టీడీపీ నుంచి 35 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

బెల్లంకొండ: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన అన్ని వర్గాల మెప్పు పొందుతుందని పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. బుధవారం మండలంలోని పాపాయపాలెం గ్రామానికి చెందిన 35 కుటుంబాలకు చెందిన 100 మంది తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. క్రోసూరులోని ఎమ్మెల్యే కార్యాలయంలో పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఎమ్మెల్యే నంబూరు శంకరరావు వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు బత్తుల వెంకట్రావు, చల్లా ఏడుకొండలు, శ్రీనివాస్, వెంకయ్య, చల్లా అనిల్, నాగేంద్రబాబు, వెంకటేశ్వరరావు, రామకృష్ణ, తురకా కాశి, నాగరాజు, అశోక్, రాజారావు, ఆదిలక్ష్మి, రమణ, మంగమ్మ, దుర్గా, గురవమ్మ, విజయమ్మ, తురకా శ్రీలక్ష్మి, దేవి, త్రివేణి, సీత, హనుమాయమ్మ, బత్తుల శ్రీను, కొండలమ్మ, ప్రసాద్, రమణ, తమ్మిశెట్టి వీరాస్వామి, మాధవ కుటుంబాలకు చెందిన వారు ఉన్నారు. అదే విధంగా చంద్రాజుపాలెం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కొడవటి దిలీప్ ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరాడు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపడుతున్న పథకాలు, నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే శంకరరావు చేస్తున్న కృషికి ఆకర్షితులమై పార్టీలో చేరుతున్నామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ గాదె వెంకటరెడ్డి, మాజీ ఎంపీటీసీ అక్కల వెంకట్రామిరెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు మర్రి అనంతరామిరెడ్డి, పుణ్యాల వెంకటేశ్వరరెడ్డి, బత్తుల లక్ష్మయ్య, శివయ్య, మేళం వెంకటేశ్వర్లు, మర్రి శ్రీనివాసరెడ్డి, మేళం కొండలు, షేక్ జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

పురుగు మందు తాగి కౌలు రైతు మృతి



మృతుడు అచ్చనాల వెంకయ్య

రాజుపాలెం: మండలంలోని బ్రాహ్మణపల్లికి చెందిన కౌలు రైతు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలకు ఎదురుగా ఉన్న కోల్డ్ స్టోరేజీ వెనుకవైపు మంగళవారం రాత్రి జరిగింది. బ్రాహ్మణపల్లికి చెందిన అచ్చనాల వెంకయ్య(44) మంగళవారం రాత్రి 3 గంటలకు ద్విచక్ర వాహనంపై ఇంటి నుంచి బయలుదేరినట్లు బంధువులు తెలుపుతున్నారు. బుధవారం ఉదయం బంధువులు వెతుకుతుండగా కోల్డ్ స్టోరేజీ వెనుక శవమై కన్పించాడు. పక్కన పురుగు మందు బాటిలు ఉన్నట్లు గ్రహించారు. మృతుడు మూడు ఎకరాలు పొలం కౌలుకు తీసుకుని పత్తి వేసినట్లు స్థానికులు తెలిపారు. అప్పుల బాధ భరించలేక మృతి చెందినట్లు బంధువులు అంటున్నారు. మృతుడికి భార్య లక్ష్మి, కుమారుడు రవి, కుమార్తె దీపిక ఉన్నారు. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఎస్ఐ సయ్యద్ సమీర్‌బాషా సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సత్తెనపల్లి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

గోశాలకు భూమి పరిశీలన

దాచేపల్లి : నగర పంచాయతీ పరిధిలోని జగనన్న కాలనీ సమీపంలో గోశాలకి కేటాయించిన భూమిని తహసీల్దార్ పి.గీతావాణి బుధవారం పరిశీలించారు. గోశాల నిర్వాహకుడు పసుపులేటి పిచ్చయ్య గోశాలకు భూమి కేటాయించాలని గతంలో జిల్లా కలెక్టర్‌కి దరఖాస్తు చేసుకున్నాడు. పరిశీలించిన స్థానిక రెవెన్యూ అధికారులు 3 ఎకరాల ప్రభుత్వ భూమిని గోశాల కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఇటీవల ఆన్‌లైన్‌లో గోశాల పేరు మీద భూమిని తొలగించారు. దీంతో పిచ్చయ్య జిల్లా కలెక్టర్‌కి ఫిర్యాదు చేశాడు. దీంతో స్థానిక తహసీల్దార్ గీతావాణి గోశాలకు కేటాయించిన భూమిని పరిశీలన చేసి రికార్డులు పరిశీలించారు. నివేదికను జిల్లా కలెక్టర్‌కి పంపిస్తామని చెప్పారు. ఈ పరిశీలనలో స్థానిక రెవెన్యూ అధికారులు, స్థానికుడు బత్తుల వెంకయ్య తదితరులున్నారు.

రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ ఎగ్జిబిషన్‌కు జై భారత్ విద్యార్థి



షేక్ రయ్యాన్

క్రోసూరు: రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ వైజ్ఞానిక ఎగ్జిబిషన్‌లో క్రోసూరుకు చెందిన జై భారత్ స్కూల్ విద్యార్థి షేక్ రయ్యాన్ ఎంపికైనట్లు ఆ పాఠశాల డైరెక్టర్ టి.జైనేంద్రరెడ్డి బుధవారం తెలిపారు. దీనిపై డైరెక్టర్ వివరాలు తెలియజేస్తూ నరసరావుపేటలో జరిగిన పల్నాడు జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ వైజ్ఞానిక ఎగ్జిబిషన్‌లో జిల్లా వ్యాప్తంగా 126 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. అందులో 13 ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయడం జరిగిందన్నారు. వాటిలో క్రోసూరులోని జై భారత్ స్కూల్‌కు చెందిన తొమ్మిదవ తరగతి విద్యార్థి షేక్ రయ్యాన్ తయారు చేసిన వీడింగ్ మిషన్ (ఎద పద్ధతి సాగులో కలుపు నివారణ యంత్రం) అబ్జర్వర్లను ఎంతగానో ఆకట్టుకుంది. విద్యార్థి షేక్ రయ్యాన్ తయారు చేసిన పరికర ప్రయోజనాన్ని తెలుసుకుని, మరింత అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ ప్రదర్శించేందుకు రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ వైజ్ఞానిక ఎగ్జిబిషన్‌కు ఎంపిక చేసినట్లు చెప్పారు. ఎగ్జిబిషన్‌లో ఉత్తమ ప్రదర్శనలను తిలకించిన జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ షేక్ రయ్యాన్‌ను అభినందిస్తూ మెరిట్ సర్టిఫికెట్, ఇన్‌స్పైర్ మానక్ అవార్డు అందించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జై భారత్ స్కూల్ డైరెక్టర్ టి.జైనేంద్రరెడ్డి మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థి బాల శాస్త్రవేత్తగా తయారు కావడానికి ప్రోత్సహించిన ఉపాధ్యాయ బృందాన్ని అభినందించారు. ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు రయ్యాన్‌ను అభినందించారు.

చౌటపాపాయపాలెం విద్యార్థికి జేఈఈ మెయిన్‌లో 99.62 పర్సంటైల్



పూజల వెంకట సాయి దీపక్

రాజుపాలెం: మండలంలోని చౌటపాపాయపాలెం గ్రామానికి చెందిన పూజల వెంకట సాయిదీపక్ ఇటీవల జరిగిన జేఈఈ మెయిన్‌లో 99.62 పర్సంటైల్ సాధించారు. చదువులో చురుగ్గా ఉండే వెంకట సాయి దీపక్ 10వ తరగతి వరకు నవోదయ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో చదివి 600లకు గాను 567 మార్కులు సాధించి మండలంలో ప్రథమస్థానంలో నిలిచాడు. అనంతరం ఇంటర్మీడియట్ విజయవాడలోని శస్త్ర అకాడమీలో చదువుతూ జేఈఈ మేయిన్‌కు హాజరయ్యాడు. జేఈఈ మెయిన్ పరీక్షలు 99.62 పర్సంటైల్ సాధించడంతో తల్లిదండ్రులు వెంకటేశ్వర్లు, శివలీలల ఆనందానికి అంతులేదు. నవోదయ పాఠశాల ప్రిన్సిపాల్ ప్రత్తి రామారావు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. గతంలో వెంకటసాయి దీపక్ అక్క ప్రవల్లిక ఆదే పాఠశాల, అదేకాలేజీలో చదివి మెడిసిన్ సీట్ సాధించి ప్రస్తుతం గుంటూరు మెడికల్ కాలేజీలో విద్యనభ్యసిస్తుంది.

ఉమ్రా యాత్రకు వెళ్లిన ముస్లింలు



దాచేపల్లి : పవిత్ర ఉమ్రా యాత్రకు బయలుదేరిన ముస్లింలను బుధవారం సన్మానించారు. నగర పంచాయతీతో పాటు పలు గ్రామాలకు చెందిన 15 మంది ముస్లింలు ఉమ్రా యాత్రకు బయలుదేరారు. వీరిని మండలంలోని గామాలపాడు గ్రామంలోని మహ్మదీయా మసీద్‌లో అంజుమాన్ కమిటీ అధ్యక్షుడు మౌలానా ముస్తఫా ఆధ్వర్యంలో సన్మానించారు. ప్రత్యేకంగా నమాజ్‌లు చేశారు. కార్యక్రమంలో మౌలానా ఫరూక్, యూనిస్, అబ్దుల్ ఖజీర్ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా ఆలయ వార్షికోత్సవ వేడుకలు



రెంటచింతల: స్థానిక రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాల స్వామి ఆలయ ద్వితీయ వార్షిక మహోత్సవ వేడుకలను బుధవారం కనులపండువగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ చైర్మన్ పల్లెర్ల సత్య వెంకటరామిరెడ్డి (రాంబాబు) నేతృత్వంలో ఆలయ ప్రధాన అర్చకులు గొట్టిపాళ్ల కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో స్వామివార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపించారు. ఎంతో వైభవంగా నిర్వహించిన రుక్మిణి, సత్యభామ సమేత వేణుగోపాల స్వామి వారి శాంతి కళ్యాణ వేడుకలను భక్తులు చూసి తరించారు. ఈ వార్షికోత్సవ వేడుకలలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. మధ్యాహ్నం 12 గంటలకు అన్నదానం కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం 5 గంటల నుంచి స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలకు మేళతాళాలతో గ్రామోత్సవం నిర్వహించారు.

వైభవోపేతంగా విగ్రహాల ప్రతిష్టా మహోత్సవం

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు



ప్రతిష్ట పూజల్లో ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

బెల్లంకొండ: మండలంలోని చంద్రాజుపాలెం గ్రామంలో బుధవారం గంగా పార్వతీ సమేత శంభులింగేశ్వర స్వామి, గోపయ్య సమేత తిరుపతమ్మ తల్లి, అంకమ్మ తల్లి, పోతురాజు, నాగమయ్య స్వామి వార్ల విగ్రహ ప్రతిష్ట, ధ్వజస్తంభ ప్రతిష్టా మహోత్సవ కార్యక్రమం వైభవోపేతంగా జరిగింది. గ్రామస్తులు అందరూ ఐక్యంగా ఆలయాన్ని నిర్మించి, బుధవారం విగ్రహాల ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించారు. సోమవారం నుంచి ఆలయంలో వేద పండితులు ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేద మంత్రాలతో మూడు రోజుల నుంచి హోమాలు చేశారు. ఆలయ ప్రతిష్ట కావడంతో గ్రామంలో సందడి నెలకొంది. ప్రతిష్టా మహోత్సవం సందర్భంగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ ప్రతిష్టా మహోత్సవం సందర్భంగా పెదకూరపాడు ఎమ్మెల్యే నంబూరు శంకరరావు పాల్గొని, దేవతలకు ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యేకు వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ చెన్నపురెడ్డి పద్మా వెంకటేశ్వరరెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు ఓర్చు సాంబశివరావు, జెడ్పీటీసీ సభ్యుడు గాదె వెంకటరెడ్డి, భద్రయ్య, మర్రి ప్రసాదరెడ్డి, వైస్ ఎంపీపీ మరియదాసు, సర్పంచ్ కొడవటి కరీముల్లా బాబూజీ, ఎంపీటీసీ మాదాసు రాంబాబు, వేల్పుల కోటేశ్వరరావు, జడ సుబ్బయ్య, గాలం రామకృష్ణ, కొండలు, గాదె మిల్లు వెంకటరెడ్డి, నాగిరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

ఆత్మీయ స్వాగత సభకు తరలిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు



పట్టణంలో వాహనాన్ని ప్రారంభిస్తున్న బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు తుమ్మల వెంకటేశ్వరరావు

సత్తెనపల్లి: నరసరావుపేట లోక్‌సభ సమన్వయకర్తగా ఇటీవల నియమితులైన మాజీ మంత్రి డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్ తొలిసారి పల్నాడు జిల్లాకు రానున్న నేపథ్యంలో వైఎస్సార్ సీపీ జిల్లా నాయకులు, కార్యకర్తలు ఏర్పాటు చేసిన ఆత్మీయ స్వాగత బహిరంగ సభకు నియోజకవర్గంలోని పార్టీ శ్రేణులు బుధవారం పెద్ద ఎత్తున నరసరావుపేటకు తరలివెళ్లారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని సత్తెనపల్లి పట్టణం, సత్తెనపల్లి రూరల్, ముప్పాళ్ళ, రాజుపాలెం, నకరికల్లు మండలాల నుంచి పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. బీసీ సామాజిక వర్గానికి చెందిన అనిల్‌కుమార్ యాదవ్‌ను రానున్న ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలనే లక్ష్యంతో వైఎస్సార్‌సీపీ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నాయకులు పెద్ద ఎత్తున తరలి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

విద్యార్థుల సమగ్ర వికాసానికి శిశుమందిరాలు తోడ్పాటు



సత్తెనపల్లి సరస్వతి శిశుమందిరంలో చిన్నారికి అక్షరాభ్యాసం చేయిస్తున్న శివస్వామి

సత్తెనపల్లి: దేశభక్తి నేర్పుతూ విద్యార్థుల సమగ్ర వికాసానికి సరస్వతి శిశుమందిరాలు తోడ్పడుతున్నాయని తాళ్లాయపాలెం శైవక్షేత్ర పీఠాధిపతి పూజ్య శ్రీశ్రీశ్రీ శివస్వామి అన్నారు. వసంత పంచమి సందర్భంగా పట్టణంలోని గుంటూరు రోడ్‌లో గల సరస్వతి శిశుమందిర్ ఉన్నత పాఠశాలలో బుధవారం నిర్వహించిన అక్షరాభ్యాస మహోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సరస్వతి శిశుమందిరాలలో క్రమశిక్షణతో పాటు విలువలతో కూడిన విద్య అందుతుందన్నారు. చిన్నారులకు ఆయన చేతుల మీదుగా అక్షరాభ్యాసం చేశారు. కందిమల్లాయపల్లె బ్రహ్మంగారి మఠ పీఠాధిపతులు వీరశివకుమారస్వామి చిన్నారులను ఆశీర్వదించారు. 25 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం చేశారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షులు డాక్టర్ గుండ్లపల్లి శ్రీధర్, సమితి కార్యదర్శి చలువాది చిన సత్యనారాయణ, పాఠశాల కార్యదర్శి చిరుమామిళ్ళ గోపీకృష్ణ, ప్రధానాచార్యులు మన్నవ ధనలక్ష్మి, సమితి ప్రబంధకారిణిసభ్యులు, పట్టణంలోని పెద్దలు పాల్గొన్నారు.

సామూహికంగా అక్షరాభ్యాసం



సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమంలో సరస్వతి హోమం చేస్తున్న దృశ్యం

అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతిలోని సరస్వతి శిశుమందిరంలో చదువుల తల్లి సరస్వతీదేవి జన్మదినమైన వసంతపంచమి సందర్భంగా చిన్నారులకు బుధవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తొలుత విఘ్నేశ్వర పూజ, నవగ్రహ మండపారాధన, సరస్వతి పూజ, హోమం అనంతరం అక్షరాభ్యాస కార్యక్రమం పూర్తి చేశారు. ఈ సందర్భంగా సంస్థ ప్రధానోపాధ్యాయుడు కోలా వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సనాతన భారతీయ సంప్రదాయాల పరిరక్షణకు సరస్వతి శిశు మందిరం నిరంతరం పాటు పడుతుందన్నారు. సరస్వతీదేవి జన్మదినమైన వసంతపంచమి రోజున అక్షరాభ్యాసం చేస్తే చిన్నారుల విద్యాభ్యాసానికి ఎటువంటి ఆటంకాలు కలుగవని భారతీయుల నమ్మకమన్నారు. సుమారు 20 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం



మొక్కజొన్న కండెలు నాసిరకంగా వచ్చాయని వ్యవసాయ శాఖ అధికారులకు చూపుతున్న రైతులు

నకరికల్లు: నాసిరకం విత్తనాల వలన పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ఉన్నతాధికారులకు సిఫారసు చేస్తామని సహాయ వ్యవసాయ సంచాలకులు బత్తుల శ్రీకృష్ణ దేవరాయలు అన్నారు. మండలంలోని చీమలమర్రి గ్రామానికి చెందిన రైతులు నూజివీడు సంస్థకు చెందిన మొక్కజొన్న విత్తనాలు నాటి నష్టపోయామన్న ఫిర్యాదు మేరకు బుధవారం రైతులతో కలసి సదరు పొలాలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలోని 20మంది రైతులు నూజివీడు కంపెనీ విన్నర్ రకం మొక్కజొన్నను సాగుచేసినట్లు తెలిపారు. పంటకోత దశకు వచ్చినప్పటికీ గింజ పాలు పోసుకోలేదని రైతులు తమ దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు సేకరించామని అన్నారు. నష్టం కలిగిన పంట విస్తీర్ణం అంచనా వేసి బాధిత రైతులను ఆదుకునేందుకు వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు, శాస్త్రవేత్తల దృష్టికి తీసుకెళ్తామని అన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు, గ్రామ వ్యవసాయ సహాయకుడు జి.జగదీష్ పాల్గొన్నారు.

యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్‌గా రామిరెడ్డి



మాచవరం: యూటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్‌గా మాచవరం మండలానికి చెందిన సీనియర్ ఉపాధ్యాయుడు ఎం.వి.రామిరెడ్డి ఎన్నికైనట్లు మండల యూటీఎఫ్ నాయకులు తెలిపారు. పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో జరిగిన 77వ వార్షిక కౌన్సిల్ సమావేశంలో జరిగిన ఎన్నికల్లో రామిరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. మండలంలోని వేమవరం మండల పరిషత్ పాఠశాల హెచ్‌ఎంగా పనిచేస్తున్న ఆయన ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కొరకు నిరంతరం కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. యూటీఎఫ్ నాయకులు జల్ది విజయప్రసాద్, కూరాకులు వెంకటేశ్వర్లు, కాంద్రకుంట రాంబాబు, కావాటి కోటేశ్వరరావు, డి.వి.కృష్ణ, మాటూరి మరియదాసు ఆయనకు అభినందనలు తెలిపారు.